

23వ రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో సాగు భూములు ఇచ్చిన భూ బాధిత గిరిజనులు చేపట్టిన రిలే దీక్ష శనివారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు డొంబు, రాంచందర్ మాట్లాడుతూ, ఉపాధి కల్పిస్తామని అధికారులు హామినిచ్చి ఇప్పటికి ఏడేళ్ల కావస్తున్నా విస్మరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన తమకు కాకుండా బయట వ్యక్తులకు ఉపాధి కల్పించారని, ఇప్పటికైనా అధికారులు ఉపాధి కల్పించాలని వారు వేడుకున్నారు.



నినాదాలు చేస్తున్న బాధితులు

రేకుల పాకలే పాఠశాలలు

- పునాదులకే పరిమితమైన భవనాలు - కాలకృత్యాలకు వాగులకు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి: -స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్ళు పూర్తయినప్పటికీ గిరిజన ప్రాంతాలలో విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు పడరాని పాట్లు పడవలసిన దుస్థితి నెలకొంది.

మండలంలోని కుడుముసారి పంచాయతీ పరిధిలోని బొడ్డపుట్టు, కిలుములు, గొర్రెలమెట్ట, గొప్పగుడిసెల మండల పరిషత్ పాఠశాలలు రేకుల షెడ్లలోనే కొనసాగుతున్నాయి. బొడ్డపుట్టు, గొర్రెలమెట్ట పాఠశాల భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు వెచ్చించింది. పునాదులలోనే భవనాలను అర్ధంతరంగా నిలిచి పోవడంతో పాఠశాల భవనాలు లేక రేకుల షెడ్లలో విద్యార్థులకు పాఠాలు చెప్పవలసిన అవసరం ఏర్పడింది. పాఠశాలకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను భద్రపరచుకునేందుకు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాఠశాలలకు సమీపంలో గల పెద్ద పెద్ద వాగులను ఆశ్రయించక తప్పడం లేదు. వర్షాకాలంలో వర్షానికి రేకుల షెడ్లు కారి పోతున్నాయి. దీంతో, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం స్పందించి మారుమూల గిరిజన గ్రామాల పాఠశాలలకు నిధులు వెచ్చించి పాఠశాలల భవనాలు నిర్మించాలని ఆయా ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బొడ్డపుట్టులో పాఠశాల



కిలుములులో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న పాఠశాల



ఎఒబి సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎఒబిలో విస్తృత తనిఖీలు

- సరిహద్దుల్లో జల్లెడ పడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల చతీస్ఘడ్ సరిహద్దుల్లో 30 మందికి పైగా మావోయిస్టులు ఎన్కౌంటర్లో మృతి చెందిన విషయం విధితమే. నెల రోజులు వ్యవధిలో సుమారు 80 మందికిపైగా మావోయిస్టులు పోలీసుల చేతిలో హతమయ్యారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ప్రతీకార దాడులకు దిగే అవకాశం ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్పెషల్ పార్టీ సిఆర్పిఎఫ్ పోలీసు బలగాలు శనివారం ఏపీ జెన్కో చెక్పోస్ట్ వద్ద ఏఓబి సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేసి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. అనుమానిత వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా స్థానిక పోలీస్ స్టేషన్కు భద్రత కట్టుదిట్టం చేశారు.

మరో వైపు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో అదనపు పోలీసు బలగాలతో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తూ జల్లెడ పడుతున్నారు. మావోయిస్టు కదలికలపై అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో ఆంధ్ర, ఒరిస్సా, చతీస్ఘడ్ సరిహద్దుల్లో నిఘా పెట్టారు. పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఎటువంటి దాడులకైనా ఉపక్రమించవచ్చని ఇంటెలిజెన్సీ నిఘావర్గాలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో పోలీసులు బలగాలకు మరింత అప్రమత్తమయ్యారు. మావోయిస్టు నుంచి ఎటువంటి నష్టం కలగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తూ గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఏవోబి సరిహద్దుల్లో పోలీసుల నిరంతరం కూంబింగ్తో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని గిరిజనులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

పాఠశాలను తరలిస్తే ఊరుకోం

ప్రజాశక్తి- పెదబయలు:మండలం సీతగుంట గ్రామ పంచాయతీ కిత్తుకొండ ప్రాథమిక పాఠశాల తరలించాలని చూస్తే చూస్తూ ఊరుకోమని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొండా రమేష్ బాబు, ఆదివాసి గిరిజన సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు సన్నిబాబు తెలిపారు. కిత్తుకొండ పాఠశాల లో చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ, ఇటీవల కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ప్రాథమిక విద్యను విచ్ఛిన్నం చేసే విధంగా కుటిల ప్రయత్నం చేస్తుందన్నారు అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం జీవో 117 తీసుకొచ్చి పది మంది పిల్లలు తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలన్నీ మూసేయాలని చూస్తోందన్నారు. 3,4,5, తరగతుల్లో చదువుతున్న విద్యార్థులను దగ్గరలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో జాయినింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో ఉన్న 32 పాఠశాలలు మూతపడతాయన్నారు. పాథమిక పాఠశాలలను యధావిధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు.స్కూల్లు ఎత్తివేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీత గుంట పంచాయతీ ఎంపీటీసీ కిమకరి బొంజు బాబు, విద్యా కమిటీ చైర్మన్ బొండా రమేష్ బాబు , పెసా కమిటీ ఉపాధ్యక్షులు బోండా ఆనందరావు, విద్యా కమిటీ వైస్ చైర్మన్ బొండా జానకమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

తాగునీటి బోర్ల మరమ్మతుకు చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని పాడు బడిన పాత బోర్లను బాగు చేయడమే తమ లక్ష్యమని ఎంపీడీవో యువి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం నీటిపారుదల శాఖ జెఈ గడుతూరి స్వర్ణలతతో కలిసి సమ్మర్ క్యాష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలం ప్రారంభం కావడంతో గ్రామాలలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యగా పాత బోర్ల మరమ్మత్తు పనులు చేపడతామన్నారు.ఆయా పంచాయతీ కార్యదర్శుల ద్వారా మండల పరిషత్, నీటిపారుదల శాఖ కార్యాలయాలకు సమాచారం అందిస్తే బోర్ల మరమ్మత్తు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. వేసవికాలంలో ప్రజలు తాగునీటిని పొదుపు చేసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న అధికారులు



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పీసా కమిటీ సభ్యులు

పీసా చట్టంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండల పరిషత్తు కార్యాలయంలో పీసా చట్టంపై శిక్షణా తరగతులు శనివారం జరిగాయి. రెండు బ్యాచ్లకు గ్రామపంచాయతీ సర్పంచ్లు, వార్డు మెంబర్లు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు 209 మంది హాజరు కావాల్సి ఉండగా, 198 మంది హాజరయ్యారు. ఏపీఎస్పైఆర్డి డిప్యూటీ డైరెక్టర్ జి.రామనాథం అబ్జర్వర్గా హాజరై పీసా చట్టంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్కేవి ప్రసాద్, జడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీటీసీ బిడి జాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న జెడ్పిటిసి గంగరాజు, నాయకులు

విజయగౌరిని గెలిపించాలి

- ప్రజా సంఘాల నేతల ప్రచారం

ప్రజాశక్తి- హుకుంపేట:ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిరిజన సంఘం, సీఐటీయూ, యూటీఎఫ్ నేతలు ప్రచారం చేపట్టారు. అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, చట్ట సభలలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పై ,గళం విప్పి మాట్లాడేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే అని అన్నారు. సమస్యలపై పోరాడే నాయకుల గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గిరిజన మహిళ సంఘం జిల్లా నేత సొంటేన హైమావతి, మండల గిరిజన సంఘం నాయకులు తాపుల కృష్ణారావు, వలసనైని లక్ష్మణ్రావు, కిల్లో రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇ - శ్రమ్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకోండి

- జిల్లా కార్మిక శాఖాధికారి సుజాత

ప్రజాశక్తి-పాడేరు:అసంఘటితరంగ కార్మికులు ఇ శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని తద్వారా సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలను పొందాలని జిల్లా కార్మిక శాఖాధికారి టి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇ-శ్రమ్ లో నమోదు చేసుకున్న వారికి 12 అంకెల గుర్తింపు కార్ - (యానివర్సల్ ఎకౌంటు నంబర్) కేటాయిం చడం జరుగుతుందన్నారు. ఈ శ్రమ్ కార్డు తో పుభుత్వం అందించే అన్ని రకాల సామజిక భద్రత, సంక్షేమ పథకాలు వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కార్మికునికి భీమా వర్తిస్తుందన్నారు. ప్రమాద వశాత్తు మరణిస్తే 2లక్షలు, పూర్తి అంగవైకల్యంకు రెండు లక్షలు, పాక్షిక అంగ వైకల్యం చెందిన వారికి లక్ష రూపాయల భీమా సదుపాయం కలుగు తుందన్నారు. 16 నుంచి 59 సంవత్సరాల వయస్స గల వారు అర్హులన్నారు. ఆదాయపు పన్ను చెల్లించని, ఈపిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని వారు అర్హులని తెలిపారు. జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. శనివారం పాడేరు మండలంలో ఇరడాపల్లి పంచాయితీ చింతగొంది గ్రామంలో 40 మంది పివి టీజీ గిరిజన వృద్ధులకు చలి రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి గౌరీ శంకర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో రెడ్ క్రాస్ సొసైటీ విశేష సేవలు అందిస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బాల్యవివాహాలు చేసుకోరాదని ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. కంటి వైద్యం, గ్రహణం మొర్రి తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించి శాస్త్ర చికిత్సలు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి సూర్యారావు, సభ్యులు జయలక్ష్మి, మర్ల మణి, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ విజ్ఞప్తి చేశారు. ఎటపాక మండలం ఎర్రబోరులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రస్థావించేందుకు ఏపీ అసెంబ్లీలో కమ్యూనిస్ట్ నేతలు లేకపోవడం పెద్ద లోటుగా ఉందన్నారు. సమస్యలపై శాసన మండలిలో నిబద్ధతతో నిరంతరం గళమెత్తే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అందువల్ల పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డివి రాఘవులుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మర్లపాటి నాగేశ్వరావు, పి వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, మండల కమిటీ సభ్యులు పి బాలకృష్ణ, ఇరపా అజయ్, ఇరపా సత్యం, బుద్దుల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ములకనపల్లిలో ప్రచారం

విఆర్.పురం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులును గెలిపించాలని కోరుతూ మండలంలో ములకనపల్లి పంచాయతీలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉన్నందున అందరూ బూత్ స్థాయిలో తిరిగి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓటు వెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కె.సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయునికి కరపత్రం ఇచ్చి ఓటును అభ్యర్థిస్తున్న సిపిఎం నేతలు



తాగునీటి బోరుకు రిగ్గింగ్ చేస్తున్న దృశ్యం

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని రేగులపాడు గ్రామపంచాయతీ కేంద్రంలో శనివారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అభ్యర్ధన మేరకు తాగునీటి బోరును ఏర్పాటు చేయటం జరిగింది. వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉన్నందున గ్రామస్తులు మంచినీటి బోరు కావాలని వారం రోజుల క్రితం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ను కోరగా ఆయన వెంటనే బోరు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ తాగునీటి బోరు మరమ్మతులు కాకుండా అందరికీ ఉపయోగపడేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు బోగ్గ ముత్తయ్య, బోగ్గ రాఘవయ్య, బీర బోయిన సుబ్బారావు, బొగ్గ కన్నయ్య, రామిరెడ్డి, రాజు, మడకం తమ్మయ్య గుండ ముత్తయ్య, గుండం రాజు, బొగ్గ రామారావు, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్పి అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మర్రివాడ పంచాయతీ పరిధి దొడ్డవరంలో ఎన్ఆర్ఇజిఎస్ విఆర్పి జుర్రా సత్యనారాయణపై పంచాయతీ సర్పంచ్ చేసిన ఫిర్యాదు మేరకు శనివారం ఎపిఒ అప్పలరాజు విచారణ చేపట్టారు. దొడ్డవరం విఆర్పి జుర్రా సత్యనారాయణ పలు అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ఆ పంచాయతీ సర్పంచ్, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు ఇటీవల ఆరోపణలు చేయడం విధితమే. ఈ క్రమంలో సర్పంచ్, తెలుగుదేశం నాయకులు విఆర్పిపై మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా దొడ్డవరం గ్రామంలో ఎంపిడిఒ ఏస్కేవి.ప్రసాద్ ఆదేశాల ప్రకారం ఏపీఓ అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ అప్పలరాజు మాట్లాడుతూ సర్పంచ్ ఫిర్యాదు మేరకు దొడ్డవరంలో విచారణ చేశామన్నారు. విచారణకు హాజరు కావాలని విఆర్పి జుర్రా సత్యనారాయణకు ముందు రోజు తెలియజేసినప్పటికీ ఆయన హాజరు కాలేదని పేర్కొన్నారు. గ్రామంలో విచారణ సమయంలో సర్పంచ్, గ్రామస్తులు, ఉపాధి కూలీలు ఇచ్చిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు సత్యనారాయణ స్థానంలో వేరే విఆర్పి విధులు నిర్వహిస్తారని తెలిపారు.



విచారణ చేస్తున్న ఎపిఒ అప్పలరాజు

వాహన రికార్డులు తప్పనిసరిగా ఉండాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

వాహనదారులు తప్పనిసరిగా వాహన రికార్డులు కలిగి ఉండాలని వెహికల్ ఇన్స్పెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా రంపచోడవరం ఆర్టీవో ఆఫీస్లో ఆటో ఓనర్స్, డ్రైవర్లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు రోడ్డు మధ్యలో నడపొద్దని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తప్పని పేర్కొన్నారు. ఓవర్టేక్ చేయొద్దని, రోడ్డు మధ్యలో పార్కింగ్ చేయవద్దని, హాస్పిటల్స్, స్కూల్స్ ప్రదేశాలలో వాహనాలను నెమ్మదిగా నడపాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

పలుచోట్ల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'



పాడేరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు: గ్రామాలలో ఎస్.డబ్ల్యుపిసిలకు బదులుగా మినీ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మినుములూరు గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మానవ హారం ఏర్పాటు చేసి వారితో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించాలని, వాటిని ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఓ లవరాజు, డివిజినల్ పిఓ పిఎస్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జవహర్ కుమార్, ఇఓపిఆర్డి రమేష్, కార్యదర్శులు, చిన్ని, అనూష, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో యువిఎస్ శ్రీనివాసరావు సూచించారు. ప్రతినెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర దివాస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. తుప్పలు తొలగించడంతోపాటు, చెత్త గ్రామానికి దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త సేకరించడం జరిగిందని ఎంపిడిఓ ఏవివి. కుమార్ అన్నారు పారిశుధ్య పనులపై కార్యదర్శులు దృష్టి పెట్టాలని కోరారు.

అల్లూరి జిల్లా :చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, స్వచ్ఛతా కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల విద్యార్థులు చింతూరు బస్టాండ్ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలిగించి, బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో...

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చింతూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో చెత్త చెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. చీపుర్లతో ఆవరణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యస్ఐ రమేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎపి జెన్‌కో ఆధ్వర్యాన

సీలేరు : జీకే.వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు శ్రమదానం చేశారు. జెన్కో కాలనీ ఒకటి నుంచి తొమ్మిదో క్రాస్ రోడ్డు వరకు చెత్తా చెదారాలు తొలగించి పరిశుభ్రపరిచారు. ఎస్ఈ సివిల్, ఈఈ సివిల్ కార్యాలయాలు, యూనియన్ బ్యాంక్ పరిసరాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మైకా కవర్లు వంటి వ్యర్థాలను ఏరి పారేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్లు సుదీర్ఘ ప్రాంతానికి తరలించి నిప్పు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఏడీఈలు దుర్గా శ్రీనివాస్, అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



సీలేరులో చెత్తను తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



నృత్యం చేస్తున్న గిరిజనులు

ఘనంగా నందీశ్వరుని జాతర

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో జరుగుతున్న నందీశ్వరుడి జాతర మహెూత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రత్యేకంగా పూజలను గిరిజనులు చేశారు. అనంతరం ఆలయ మైదాన ప్రాంగణంలో గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చేస్తూ ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు విజయ, ఉప సర్పంచ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న సర్పంచ్

గ్రామాల్లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి -అరకులోయరూరల్:అనంతగిరి మండలం కోనాపురం పంచాయితి కరాయిగూడ గ్రామంలో శనివారం పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కోనాపురం పంచాయితి సర్పంచ్ గుబాయి అప్పలమ్మ ఆధ్వర్యంలో పివిటీజి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మారుమూల పివిటిజి గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, తదితర సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఎస్టి కమిషన్ మెంబర్ రామలక్మి, నాయకులు కిల్లో ప్రసాద్, గుబాయి జగన్నాథం, వార్డ్ మెంబర్ గుబాయి వెంకటరావు పాల్గొన్నారు.

హేచరీల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లాలోని రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల లైసెన్స్ రెన్యువల్ నిమిత్తం చెన్నై, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సిఎఎ) డైరెక్టర్ డాక్టర్ పి.శంకరరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, సిబ్బంది శనివారం మంగమారిపేట, తిమ్మాపురం గ్రామాల్లో ఉన్న పలు రొయ్యల హేచరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధ యూనిట్లలో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిన దృష్ట్యా, జిఒ 2 ప్రకారం టాస్క్ ఫోర్స్ కమిటీ కూడా సంబంధిత కేంద్రాలను పరిశీలించింది. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో వినియోగించే మేతలు, ప్రో బయోటిక్స్, ఇతర ఉత్పత్తులు సిఎఎ ద్వారా ధ్రువీకరించబడ్డవి మాత్రమే ఉపయోగించాలని సిఎఎ డైరెక్టర్ శంకరరావు సూచించారు. ఎంపెడ అధికారులు కూడా నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపెడ డీడీ ప్రసాద్‌నాయక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య, హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు పిఎన్‌వి.ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విఆర్‌ఒలకు శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మార్చి 1వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఏడవ చిన్న తరహా సాగునీటి సంఘాలు గుర్తింపుపై విఆర్‌ఒలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యాన ఎఎస్ఒ శేషాద్రి శిక్షణ ఇచ్చారు. భూగర్భ జల వనరులు, ఉపరితల నీటి పారుదల నమోదుతోపాటు నీటి సంఘాల గుర్తింపుపై శిక్షణ అందించారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాగునీటి ట్యాంకుల శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి:తాగునీటి ట్యాంకులు, కుండీల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయని అధికారులు తెలిపారు. క్లోరి నేషన్ పద్ధతిని ఇంజనీరింగ్ అధికారులు అర్జున్, సంధ్య, భారతిలు మండల కేంద్రంలో బాలికల పాఠశాలలలో పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌లకు సలహాలు సూచనలు చేశారు. శుద్ధి చేసిన నీటిని వినియోగిస్తే ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని సూచించారు. అనంతరం ఎంపీడీవో ఏవివి కుమార్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం దీనిపై దృష్టి సారించి 15 రోజులకు ఒకసారి ట్యాంకులను పరిశుభ్రతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమెల రూతు, ఎంఈఓ బాలాజీ, హెచ్‌ఎం. విమల కుమారి పాల్గొన్నారు.

ఆశ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి అప్పలనర్సయ్య కాలనీలో నివాసముంటున్న ఆశ కార్యకర్త భారతి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. అనారోగ్యం కారణంగా రెండు రోజుల క్రితం కెజిహెచ్‌లో చేరారు. పరిస్థితి విషమించి మృతిచెందారు. అప్పలనర్సయ్య కాలనీ గంగిరెడ్డి కాలనీలో గత 20 సంవత్సరాలుగా ఆమె వైద్య సేవలందించారు.

వైద్య విద్యార్థులు ఆదర్శంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : వైద్య విద్యార్థులు భావితరాల విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ సూచించారు. విద్యతో పాటు సామాజకి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ శనివారం స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. అనాటమీ విభాగంలోని బయోకెమిస్ట్రీ, హిస్టోలజీ ల్యాబ్, బోధనా తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో మాట్లాడుతూ సామాజిక సేవా క్లబ్, క్లబ్, డ్రాయింగ్ క్లబ్బు ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సూచించారు. వైద్య విద్యార్థులకు ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీలో ఆశక్తి ఉంటే ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేద్దామన్నారు. క్లబ్బులు, సామాజిక సేవా కార్యాక్రమాల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.అనంతరం మెడికల్ కళాశాల నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. అదనపు వర్కర్లను నియమించి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సందర్శించి మురుగు కాలువల చర్యలు చేపట్టాలన్నారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుపై ఆరా తీసారు. బ్లాక్1ను ఏప్రిల్ లోను, బ్లాక్ 2 ఆగస్టు, బ్లాక్ 3 జూన్ నెలలో పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. వసతి గృహాలను ఏప్రిల్ నెల నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వైద్య విద్యార్థినీ, విద్యార్థుల వసతి గృహాలను సిబ్బంది నివాస గృహాలను మే నెలలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. నెట్ వర్క్ కవరేజి, కాలేజీ బస్సులు ఆడిటోరియం, ఆట స్థలం ఏర్పాటు చేయాలని వైద్య విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డి. హేమలతా దేవి, వైస్ ప్రిన్సిపాల్ కె. లక్ష్మి కుమారి, ప్రొఫెసర్ శిరీషా, ఈఈ అచ్చంనాయుడు, డి ఇ.లు. వర్మ, ఎ.ఫణికుమార్, జె.ఇ. సురేష్, డిజి ఎం.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 'అపోథెకి 2 కె 25' పేరుతో ఈ నెల 25వ తేదీన జరుగనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, సాంకేతిక సదస్సు ముఖ్యోద్దేశం 'ఇన్‌స్పైర్ అండ్ ఇన్నోవేట్ ది గ్రీమింగ్ ఫ్యూచర్ ఆఫ్ ఫార్మసీ' అని వివరించారు. ఫార్మసీ రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఇది వేదిక కాగలదన్నారు.



కూల్ వాటర్ క్యాన్లు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

జెడ్‌పి హైస్కూల్‌కు కూల్ వాటర్ క్యాన్లు వితరణ

ప్రజాశక్తి-విఆర్.పురం : నూఫ పౌండేషన్ వ్యవస్థాపకులు నూఫ అనిల్ శనివారం విఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కూల్ వాటర్ క్యాన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలను దృష్టిలో పెట్టుకొని ఎవరు డీహైడ్రేషన్ బారిన పడకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కూల్ వాటర్ క్యాన్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.బాబురావు, ఉపాధ్యాయులు కారం రాము, శిరమయ్య, డివివి.శేఖర్, సున్నం చంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధారాలమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం ధారాలమ్మ అమ్మవారి ఆలయంలో దేవాదయ శాఖ ఈవో సాంబశివరావు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో హుండీని శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో సాంబశివరావు మాట్లాడుతూ హుండీలో భక్తులు వేసిన కానుకలు లెక్కించగా రూ.3.86.770 నగదు, 33 గ్రాములు బంగారం, 876 గ్రాములు వెండి వచ్చినట్లు వెల్లడించారు.

ధారలమ్మను దర్శించుకున్న సుధారాణి

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి శనివారం ధారాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత సుధారాణి మొదటిసారిగా ధారాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నారాయణమూర్తి ఆమెకి ఘనస్వాగతం పలికారు. ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ స్థితిగతులు గురించి ఈవో సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది రామకృష్ణ, తేజ, సిద్ధాంతి ప్రసాద్, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా కస్టమ్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ కస్టమ్స్ డే వేడుకలు విశాఖ నగరంలోని పోర్ట్ స్టేడియంలో ఉన్న విశ్వనాథ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి విశాఖపట్నం కస్టమ్స్ విభాగం ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ అధ్యక్షత నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణానికి, శ్రేయస్సుకు కస్టమ్స్ పాత్ర కీలకమన్నారు. వికసిత్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో కస్టమ్స్ శాఖ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. ఎగుమతి, దిగుమతుల్లో ఆయా ఉత్పత్తుల స్వభావానికి తగ్గట్టుగా విభిన్న పద్ధతులను అవలంబిస్తూ 11 వేల ఉత్పత్తులను హ్యాండిల్ చేయడం సామాన్య విషయం కాదన్నారు. 205 దేశాలకు 7 వేలకుపైగా ఉత్పత్తులను మనం ఎగుమతి చేస్తున్నామన్నారు. 800 బిలియన్ డాలర్లకు సమానమైన ఎగుమతులు, 850 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతున్నాయన్నారు.. రాబోయే రోజుల్లో 100 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎగుమతులే లక్ష్యంగా నిర్ణయించుకున్న పోర్ట్ అథారిటీకి కస్టమ్స్ సహకారం ఎంతైనా అవసరమన్నారు. విశాఖపట్నం జోన్ కస్టమ్స్ అండ్ సిజిఎస్‌టి చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ మాట్లాడుతూ ఆదాయ సేకరణ, వాణిజ్య సౌలభ్యం, దేశ ఆర్థిక సమగ్రతను పరిరక్షించడం ద్వారా దేశ నిర్మాణంలో విశాఖ కస్టమ్స్ గణనీయమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. 2023-2024లో విశాఖ కస్టమ్స్ జాతీయ ఖజానాకు రూ.15167.62 కోట్ల ఆదాయాన్ని అందించిందని, ఈ ఏడాది జనవరి 2025 వరకు కస్టమ్స్ రెవెన్యూ వసూళ్లు రూ.11,198.36 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విఎస్ఇజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిబిఎస్ రోగులకు మెరుగైన వైద్యం

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అరుదైన జిబిఎస్ (గులియన్ బారే సిండ్రోమ్) వ్యాధితో బాధపడుతున్న ఐదుగురు రోగులు కింగ్ జార్జ్ ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ వార్డులో చికిత్స పొందుతున్నారని, వారందరికీ ప్రత్యేకంగా వైద్యులను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య చికిత్స అందజేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. శనివారం ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్‌ఎంఒ డాక్టర్ మెహర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవిలతలతో కలిసి జిబిఎస్ రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. వైద్యం విషయంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.



రోగిని పరామర్శిస్తున్న కెజిహెచ్ సూపరింటెండెంట్ శివానంద

ఆందోళన చెందొద్దు

జిబిఎస్ కలకలం వార్తల నేపథ్యంలో మీడియాతో శివానంద మాట్లాడుతూ జిబి సిండ్రోమ్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆ వ్యాధి తీవ్రంగా ఉందనేది అబద్ధమని పేర్కొన్నారు. ఇది చాలా పురాతనమైన వ్యాధని తెలిపారు. ఆ వ్యాధితో కెజిహెచ్‌కు రోగులు వస్తే వారికి అవసరమైన మందులు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి ఖరీదైన మందులు అయినప్పటికీ ఉచితంగానే ఇస్తున్నామన్నారు. కొద్దిరోజుల క్రితం ఐదుగురు రోగులు వచ్చారని, వారిని ఇన్ పేషెంట్లుగా ఉంచి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళంలో ఈ వ్యాధి కలకలం రేపిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము అప్రమత్తమయ్యామన్నారు. డాక్టర్ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. జిబిఎస్ లక్షణాలను తెలియజేశారు. ఈ వ్యాధి బారిన పడితే బాధితుడిలోని నరాలు, కండరాలు బలహీనంగా మారుతాయన్నారు. వివిధ రకాల వైరల్ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు సోకుతాయన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

కార్పొరేట్ హత్యలు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విద్య ఒక వికాసం'.. కానీ అది కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల్లో మాత్రం విద్యార్థుల పాలిట విషాదమవుతోంది. నాలుగు రోజుల క్రితం విశాఖ నగర శివారు మధురవాడ వద్దనున్న నారాయణ కార్పొరేట్ కాలేజీలో జరిగిన ఘటన దీన్ని పట్టిచూపుతుంది. ఆ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒడిశాకు చెందిన 17 ఏళ్ల చంద్ర వంశీ కళాశాల ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సరిగా చదవడం లేదంటూ కొంతమంది లెక్చరర్లు ఆ విద్యార్థిని మందలించడమే కారణంగా తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు గతంలో నగరంలోని గాజువాక, మధురవాడ, పెందుర్తి సహా పలుచోట్ల చోటుచేసుకున్నాయి. తాజాగా మధురవాడ ఘటనపై విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ స్పందించి ఒత్తిడి పెంచే చదువులు తగవని పేర్కొంది. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు విద్య అందించాలని డిమాండ్ చేసింది. ఆ సంఘం నాయకులు తాజా ఘటనపై ఆందోళనకూ దిగారు. విద్యార్థి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యాన్ని వదిలేసి న్యాయం కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేయడం విస్మయం గొలిపే అంశం.



అసలేం జరుగుతోంది ?

ఏదైనా ఒకటి ఇలాంటి ఘటన జరిగితే తర్వాత అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు అప్పటికప్పుడే కదిలి పరిస్థితిని సమీక్షించడం చేసి, ఆ తర్వాత వదిలేస్తున్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నది వాస్తవం. ఫీజులే లక్ష్యంగా, విద్యార్థులపై చదువుల ఒత్తిడే క్రమశిక్షణగా కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా తమ అనైతిక విధానంతో చెలరేగిపోతున్నాయి. విశాఖలోని పిఎం.పాలెంలో ఇదే విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు గతంలో యాజమాన్య తీరుపై ఆందోళనలకు దిగారు. క్రమశిక్షణ పేరుతో కఠినంగా దండించడం కార్పొరేట్ యాజమాన్యాలకు అలవాటుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై ఇలాంటి చిన్న చిన్న ఒత్తిడులే దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తున్నాయి. విద్యార్థుల పట్ల సముచిత దృష్టి, విద్య పట్ల సమగ్ర వికాసం ఈ కార్పొరేట్ విద్యాసంస్థల్లో కొరవడుతోంది. దీంతో విద్యార్థి లోకం ఒత్తిడితో కూడిన చదువులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పుస్తకాల బరువు, హోంవర్కులు, పరీక్షలు, మార్కులు, ర్యాంకులు వంటి వాటి హోరుతో తీవ్ర మానసిక వేదనకు విద్యార్థులు గురౌతున్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఇవి నిత్యకృత్యంగా మారినందున ఈ తరహా దుర్ఘటనలకు ఆస్కారమిస్తోంది.

నగరంలోని సుమారు 20కి పైగా కార్పొరేట్ సంస్థల్లో ఆటపాటలు కరువై ఎప్పుడూ పుస్తకాలతో విద్యార్థులు కుస్తీ పడుతుండడం రివాజుగా మారిపోయింది. సమాజ తీరును సరైన రీతిలో అర్థం చేసుకునే సామర్థ్యం, అవగాహనా శక్తి రాకముందే విద్యార్థుల్లో విపరీత ఆలోచనలు పెరిగిపోయి డ్రగ్స్‌వైపు మరలడం, మద్యం సేవించడం, ఇలా బలవన్మరణాలను ఎంచుకోవడం కనిపిస్తోంది.



శ్రీరాములు స్మారక స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న కిరణ్ తదితరులు

ఆదర్శప్రాయుడు ఇరపా శ్రీరాములు

ప్రజాశక్తి- అల్లూరి జిల్లా : మాజీ సమితి ప్రెసిడెంట్ ఇరపా శ్రీరాములు 19వ వర్ధంతి కార్యక్రమం శనివారం జి హరనాథ్ అధ్యక్షతన ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామంలో జరిగింది. శ్రీరాములు స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, గిరిజనుల కోసం నీతి నిజాయితీతో చివరి వరకు పని చేసిన ఇరపా శ్రీరాములు లాంటి నేతలను ఆదర్శం తీసుకొని ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మర్లపాటి నాగేశ్వరావు, పి.వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, మండల కమిటీ సభ్యులు పి బాలకృష్ణ, ఇరపా అజయ్, ఇరపా సత్యం, బుద్దుల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని అంతాడ పంచాయితీ, కొత్తపల్లి గ్రామంలో హిమగిరి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమగిరి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి ఎం.సత్తిబాబు మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ మూడు నెలలు పాటు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏవి భగవాన్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు స్వయం ఉపాధికి దోహద పడుతుందని, అందుకు ప్రతి మహిళా పట్టుదలతో ఈ శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. లిఫ్ట్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ సిహెచ్‌వియస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమలో హెల్ప్ సంస్థ సెక్రెటరీ జి.శ్రీనిబాబు, అధ్యక్షులు వి.అప్పారావు, రేవతి చార్టబుల్ ట్రస్ట్ డైరెక్టర్ బి.శివ, సిఆర్‌డిఎస్ డైరెక్టర్ ఎస్.నూకరాజు, మారుతి విలేజ్ ఫుడ్స్ డైరెక్టర్ కె.శేషుబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : అడ్డతీగల మండల కేంద్రంలోని డ్రైనేజీలో పూడికను సర్పంచ్ చిట్టెమ్మ ఆధ్వర్యాన శనివారం తొలగించారు. చెత్తా చెదారంతో మురుకు నీరు ప్రవహించకపోవడవంతో దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ స్వయంగా దగ్గర ఉండి డ్రైనేజీలో చెత్తను తీయించడం జరిగింది. ఇకనుండి ప్రతిరోజు మధ్యాహ్నం నుండి పంచాయతీలో గల ప్రతి డ్రైనేజీని కూడా శుభ్రం చేయించడం జరుగుతుందని తెలిపారు. ప్రధాన డ్రైనేజీ శుభ్రపర్చడానికి తగినంత సిబ్బంది లేరని, అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవో కెఆర్ విజయ్ కోరడం జరుగుతుందని తెలిపారు. చేతిపంపులు రిపేర్ చేయుటకు కావాల్సిన నిధులు లేవని, ఈ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి, మరమ్మతులు చేయిస్తామని సర్పంచ్ చిట్టెమ్మ తెలిపారు.



డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ చిట్టెమ్మ